**నాణ్యత పరంగా చూస్తే**

- చేపలను పట్టి చూసినప్పుడు వాటి శరీరం గట్టిగా ఉండాలి.
- మెత్తగా గానీ, వేలాడేటట్టు గాని వుండకూడదు.
- పట్టుకున్నప్పుడు చేతి వేళ్ళ ముద్రలు పడకూడదు.
- చేప మొప్పలు (గిల్స్) ఎర్రని రంగులోనూ, కళ్ళు ప్రకాశవంతంగాను వుండాలి.

చెరువులో నీరు తగ్గి చేపల సాంద్రత అధికమయితే, చేపలను కొంతమేర పట్టేయాలి. ముందుగా పెద్దసైజు చేపలను పట్టి మార్కెట్ చేయాలి. శీతాకాలం చివర లేదా వేసవి కాలంలో నీరు బాగా తగ్గిన వెంటనే చేపలను మొత్తంగా పట్టి, మార్కెట్ చేసుకుంటే లాభదాయకంగా ఉంటుంది.

**మార్కెటింగ్ విధానం - టోకు మార్కెట్:**

చేపలను ఏక మొత్తంలో అమ్మటాన్ని టోకు వ్యాపారంగా చెబుతారు. ఇలా ఎక్కువగా హైదరాబాదు, కలకత్తా వంటి పెద్ద పెద్ద మార్కెట్‌లకు తరలిస్తారు. దీనికి పెద్ద సైజు చేపలే అనుకూలమైనవి. పెట్టుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. ఇందులో వ్యాపారులు/ మధ్య దళారుల ప్రమేయం ఎక్కువ. మత్స్యశాఖ అధికారుల సలహా మేరకు మార్కెటింగ్ చేసుకోవడం మంచిది.

**చిల్లర/ స్థానిక మార్కెట్:**

చేపలను స్థానికంగా అమ్మటాన్ని చిల్లర మార్కెట్ అంటారు. ఈ మార్కెట్‌లో ఎక్కువగా మహిళలు సరుకుని అమ్ముతారు. ఈ మార్కెట్‌పై ఎక్కువ దృష్టి నిలిపితే చేపల వినియోగం పెరుగుతుంది. స్థానిక ప్రజలకు మంచి పౌష్టికాహారం అందుతుంది. చేపలకు గిట్టుబాటు ధరతో పాటు మత్స్యకారుల ఆదాయం మెరుగుపడుతుంది. అలాగే గ్రామీణ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

**ఆంధ్రప్రదేశ్ కరువు సమాయత్త కార్యక్రమం (కరువు కవచం)**

THE WORLD BANK    SERP    వాసన్



# చేపలు పట్టడం, మార్కెటింగ్



**చెరువుల్లో చేపల పట్టడం, అందులో తీసుకొనే జాగ్రత్తలను ముఖ్యంగా మూడు దశలలో చూడవచ్చు.**

**1. పట్టే ముందు జాగ్రత్తలు:**

చేపల పెంపకం పూర్తయి చేపలు మార్కెట్టు సైజు చేరుకున్న దశలో ఈ కింది చర్యలు తీసుకోవాలి. రైతులు తమ వద్ద వున్న సైజు, జాతి రకాల చేపలను దృష్టిలో పెట్టుకొని దగ్గరలో వున్న మార్కెట్‌లో ధరలను పరిశీలించుకోవాలి. ధర నిలకడగా వుందా లేదా పెరిగే సూచనలు ఉన్నాయా గమనించాలి. ధరలు పెరిగే సూచన ఉంటే చేపల పెంపకం పొడిగించే అవకాశాలను బేరీజు వేసుకోవాలి. పట్టే సమయం, ధరలను దృష్టిలో ఉంచుకొని వ్యాపారులను నిర్ధారించుకోవాలి. చెరువు గట్టుమీదే తూకం జరిగే విధంగా వ్యాపారితో సంప్రదించుకోవాలి. మధ్యవర్తులు, దళారుల చేతుల్లో మోసపోకుండా సరైన తూకం పాటించి, వెంటనే సొమ్ము ముట్టచెప్పే వ్యాపారులను ఎంచుకోవాలి.

చేపలు పట్టే ముందురోజు నుండి చేపలకు మేత నిలిపివేయాలి. చెరువు విస్తీర్ణం, లోపల ఉన్న చేపల సంపదను బట్టి పట్టడానికి ఏర్పాటు చేసుకోవాలి. చిన్న చెరువులయితే ఒకేరోజున పట్టేటట్లు చూసుకోవాలి. తూము ద్వారా నీరు పూర్తిగా బయటకు పోనట్లయితే పల్లపు ప్రాంతపు నీరు బయటకు తోడి వేయడానికి డీజిల్ పంపు ముందుగానే ఏర్పాటు

చేసుకోవాలి. చేపలు పట్టేవారిని, ఐస్ ప్యాకింగ్ చేసే వారిని కుదుర్చుకోవాలి. ఎంత ఐస్ కావాల్సి వుంటుందో ముందుగా అంచనా వేసుకొని నిర్ణీత సమయానికి అందేటట్లు ఏర్పాటు చేసుకోవాలి.

**2. పట్టేటప్పుడు జాగ్రత్తలు:**

సాధారణంగా వాతావరణ ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు, తెల్లవారుజామున చేపలు పట్టడం ద్వారా చేపల నాణ్యత పెంచుకోవచ్చు. నీటి మట్టం మూడవ వంతుకు తగ్గిన తరువాత చెరువు వెడల్పును బట్టి లాగుడు వలతో, చెరువు లోతు భాగం నుండి వెనక భాగం వైపు చేపలను పట్టాలి. చిన్న సైజు చేపలు ఉంటే వాటిని తిరిగి పెంచుకోటానికి అనుకూలంగా ఉండే వేరొక చెరువులో వేసి పెంచుకోవచ్చు. నీటిమట్టాన్ని తగ్గిస్తూ, లాగుడు వలను ఉపయోగిస్తూ, చేపలను త్వరత్వరగా పట్టాలి. నీరు బయటకు పోయే తూము ద్వారానికి వల సంచి కుట్టి చేపలను పట్టవచ్చు.

పట్టిన చేపకు ఎటువంటి దెబ్బలు తగలకుండా చూడాలి. పరిశుభ్రమైన నీటితో కడిగి, బుట్టల్లోగాని, ప్లాస్టిక్ క్రేట్లలో గానీ వేయాలి. చేపలు పైకి ఎగరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తూకం వేసే ప్రదేశానికి త్వరగా తీసుకొని పోవాలి. పట్టేటప్పుడు నీటిని ఎక్కువగా బురద చేయకూడదు. దానివల్ల చివరగా పట్టిన చేపల నాణ్యత తగ్గే అవకాశం ఉంది. చివరగా, చిన్న చిన్న గుంటల్లో నీరు ఉంటే చేతితో ఏరి చేపలను పట్టుకోవాలి. చేపలు పట్టడానికి ఎటువంటి రసాయనాలు కానీ, పేలుడు పదార్థాలను కానీ వాడకూడదు.

**3. పట్టిన తరువాత జాగ్రత్తలు:**

బయట వాతావరణంలోని ఉష్ణోగ్రత, పరిసరాల శుభ్రత చేపల నాణ్యతను ప్రభావితం చేస్తాయి. చేపలను వెంటనే నేలపైకి దించి, తూకం వేయడం కానీ లేక ఐస్‌తో కలపాల్సిన అవసరం కానీ ఏర్పడవచ్చు. అప్పుడు నేలపై పరిచిన ప్లాస్టిక్ కాగితం మీద మాత్రమే నెమ్మదిగా దించాలి. ఎటువంటి దెబ్బలు తగలకుండా, మట్టి, బురద వంటి ఇతర పదార్థాలు అంటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తూకం, ఐస్ వేసి ప్యాకింగ్ చేయడం, రవాణా చేసే ప్రదేశం ఒకేచోట ఉండాలి. దానివల్ల సమయం వృధా కాకుండా ఉంటుంది. చేపలు చెడిపోవడానికి అవకాశం ఉండదు.

తూకం వేసిన వెంటనే ఐస్‌తో కలిపి బుట్టల్లోగాని లేక ప్లాస్టిక్ క్రేట్లలో గాని ప్యాకింగ్ చేయాలి. తక్కువ ఉష్ణోగ్రత వద్ద (అంటే ఐస్‌లో ఉంచడం వల్ల) చేపలు చెడిపోకుండా చూడవచ్చు. పరిశుభ్రమైన మంచినీటితో తయారు చేసిన ఐస్‌నే వాడాలి. రవాణాకు పట్టే సమయాన్ని బట్టి చేపలు, ఐస్ 1:1 నిష్పత్తిలో ఉపయోగించాలి. బుట్టల అడుగు భాగంలో ఐస్ వేసిన తరువాత ఒక వరస చేపలను పరచాలి. ఈ విధంగా ఐస్, చేపలను వరసలుగా పరిచి వాటికి పూర్తిస్థాయి చల్లదనం తగిలేటట్లు చూడాలి. మోతాదుకు మించి ఎక్కువ వరుసల్లో చేపలు పరవగూడదు. అలాచేస్తే పైన ఉన్న చేపల బరువుకు అడుగు భాగంలో ఉన్న చేపలు నలిగిపోయే ప్రమాదం ఉంది.

ప్లాస్టిక్ క్రేట్లలో ప్యాకింగ్ చేసేటప్పుడు, కరిగిన ఐస్ నీళ్ళు బయటకు పోయే విధంగా అడుగు భాగంలో రంధ్రం ఏర్పాటు చేయాలి. ఐస్ నీళ్ళల్లో ఉన్నప్పుడు కూడా చేపలు చెడిపోయే ప్రమాదం ఉంది. మంచిగా ప్యాకింగ్ చేసిన చేపలను మామూలుగా ఒకటి, రెండు రోజుల వరకు పాడవకుండా రవాణా చేయవచ్చు. సుదూర ప్రాంతాలకు తరలించవలసి వచ్చినపుడు దూరాన్ని బట్టి రెండు, మూడు మార్లు ఐస్‌ను మార్చి రీప్యాకింగ్ చేయాలి. లేదా శీతలీకరణ సౌకర్యం ఉన్న వ్యాన్‌లో రవాణా చేయాలి. ఇలా చేస్తే 7 నుంచి 8 రోజుల వరకు చేపలు పాడవకుండా కాపాడవచ్చు.

- సరైన సమయంలో చేపలు పడితే అధిక మొత్తంలో లాభాలు పొందవచ్చు. చెరువులో చేపల సాంద్రత పెరిగి యాజమాన్య సమస్యలు కలిగినప్పుడు, సాంద్రత తగ్గించటానికి పెద్దసైజు చేపలను వలలతో పట్టి అమ్మవచ్చు.
- మామూలుగా చేపలను మార్చి నుంచి మే నెలల్లో పడతారు. అప్పుడు మార్కెట్ సరఫరా పెరిగి గిరాకి తగ్గుతుంది, ధర తక్కువ పలుకుతుంది. అందువల్ల నీటి వసతిని బట్టి వేరే నెలలో పడితే అధిక లాభం పొందవచ్చు.

**చేపల మార్కెటింగ్**

మార్కెటింగ్ అనేది ఒక కీలక అంశం. సరైన గిట్టుబాటు ధర రావాలంటే చేపలు శుభ్రంగా, నాణ్యంగా ఉండాలి. లేకపోతే నష్టాల బారిన పడాల్సి వస్తుంది.